సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 19 । మార్చి । 2024



పెద్దాస్పత్రికి ఫుల్ స్కాన్

కేజీహెచ్‌లో కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతోంది. అత్యాధునిక స్కానింగ్ పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. 8లో



14 రోజుల చిన్నారికి అరుదైన చికిత్స 8లో

14 నెలల చిన్నారికి సన్‌రైజ్ పిల్లల ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్స చేసి ప్రాణం కాపాడారు.



'స్టార్' సిటీ 8లో

న్యూస్‌రీల్

ఉమ్మడి విశాఖ వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా నాగిరెడ్డి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి విశాఖ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా తిప్పల నాగిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ పని చేస్తారు.

చందనోత్సవంలో అంతరాలయ దర్శనాలు వద్దు



సింహాచలం : సింహాచలం క్షేత్రంలో మే 10న జరిగే చందనోత్సవానికి సంబంధించి రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఇటీవల మార్గదర్శకాలు జారీ చేశారు. ట్రస్ట్ సభ్యులతో చర్చించి ఈనెల 30వ తేదీలోపు దేవదాయశాఖ కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించారు. చందనోత్సవం రోజు కేవలం విధుల్లో ఉన్న వైదికులకు, ఆలయ సంప్రదాయం ప్రకారం అనుమతులు ఉండేవాళ్లకు మాత్రమే అంతరాలయ దర్శనాలు కల్పించాలని, మిగతా వారికి కల్పించవద్దని పేర్కొన్నారు. చందనోత్సవం రోజు ఘాట్‌రోడ్డులో కేవలం మినీ బస్సులు మాత్రమే నడపాలని తెలిపారు. కేవలం ఘాట్‌రోడ్డులో ఒకవైపు మాత్రమే అనుమతి ఉండేలా చూడాలన్నారు. ఆరోజు విధుల్లో ఉండే స్టాఫ్‌ను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. అలాగే టికెట్ల తనిఖీలు, క్యూల నిర్వహణ వద్ద పోలీసులను ఏర్పాటు చేయాలని సూచించారు.

డీఐపీఆర్వోగా ఎస్‌వీ రమణ బాధ్యతల స్వీకరణ



మహారాణిపేట: జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి (డీఐపీఆర్వో)గా ఎస్‌వీ రమణ సోమవారం సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జునను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్‌వీ రమణ ఇప్పటి వరకు విజయనగరం జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించారు. విశాఖ జిల్లా నూతన డీఐపీఆర్వో (ఎఫ్ఏసీ)గా సోమవారం విధుల్లో చేరారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పని చేసిన వి.మణిరామ్ విశాఖ ఆర్జేడీ (ప్రాంతీయ సంయుక్త సంచాలకులు) హోదాలో ఇకపై సేవలందించనున్నారు.

వారానికి ఐదు రోజులు డిబ్రూఘడ్-కన్యాకుమారి

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రస్తుతం వారానికి నాలుగురోజులు నడుస్తున్న డిబ్రూఘడ్-కన్యాకుమారి-డిబ్రూఘడ్ ఎక్స్‌ప్రెస్‌ను ఇకపై ఐదు రోజులు నడిచే విధంగా చర్యలు తీసుకున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. డిబ్రూఘడ్-కన్యాకుమారి (22504) వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 22వ తేదీ నుంచి ప్రతీ ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి-డిబ్రూఘడ్(22503) వివేక్ ఎక్స్‌ప్రెస్ ఈనెల 26వ తేదీ నుంచి ప్రతీ సోమ, మంగళ, బుధ, గురు, శనివారాల్లో బయల్దేరుతుంది.

పోలింగ్ స్టేషన్లు 1991
సిబ్బంది 14,335

- ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ఆరుగురు సిబ్బంది నియామకం
- ఎన్నికల విధులపై ఇప్పటికే మూడు విడతల్లో శిక్షణ తరగతులు
- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారి ఏర్పాటు
- ఎన్నికల ప్రవర్తనా నియమావళి పరిశీలన, అమలుకు 59 ప్రత్యేక బృందాలు

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక సమరానికి నగారా మోగడంతో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయి ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఇప్పటికే నియోజకవర్గాల వారీగా ఎన్నికల అధికారులు, సిబ్బంది నియామకం పూర్తి చేసింది. వారికి మూడు విడతల్లో శిక్షణ తరగతులు కూడా చేపట్టింది. నామినేషన్ పత్రాల సమయంలో చేపట్టాల్సిన చర్యలు, ప్రచారంలో పరిశీలించాల్సిన అంశాలు, ఎన్నికల కమిషన్‌కు అందించాల్సిన నివేదికలు, పోలింగ్ నిర్వహణ తదితర అంశాలపై మరోసారి శిక్షణ అందించనున్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని నియమించారు. విశాఖపట్నం పార్లమెంట్ నియోజకవర్గానికి జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రచారం, ఖర్చులు, నామినేషన్లు మొదలైన వాటన్నింటిపై రిటర్నింగ్ అధికారులు దృష్టిసారించనున్నారు.

అత్యవసరం కోసం 20 శాతం సిబ్బంది

జిల్లా వ్యాప్తంగా 1941 పోలింగ్ కేంద్రాలు గుర్తించారు. వీటితో పాటు అదనంగా 50 అనుబంధ పోలింగ్ స్టేషన్లు గుర్తించారు. మొత్తం 1991 పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి **పోలింగ్ స్టేషన్‌కూ ఒక ప్రిసైడింగ్ అధికారి, మరో ఐదుగురు సహాయక సిబ్బంది చొప్పున మొత్తం ఆరుగురిని నియమించారు. వీరితో పాటు అత్యవసర సమయంలో వినియోగించేందుకు 20 శాతం మంది పోలింగ్ సిబ్బందిని సైతం నియమించి.. వారికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించారు. మొత్తంగా 14,885 సిబ్బందిని ఏర్పాటు చేశారు. అలాగే** జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని పరిశీలించేందుకు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ)ని పరిశీలించి.. నివేదికలు అందించేందుకు 18 బృందాల్ని ఏర్పాటు చేశారు. 23 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 18 వీడియో సర్వైలెన్స్ బృందాలు(వీఎస్‌టీ)లు చొప్పున మొత్తం 59 టీమ్స్ నగరంలో పహారా కాస్తున్నాయి. ప్రతి పార్టీ అభ్యర్థిపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచుతూ.. వారి కదలికలు, ప్రచారానికి చేస్తున్న ఖర్చు, ఇతర అంశాలపై ఉన్నతాధికారులకు నివేదికలు అందించనున్నారు. అలాగే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు.



కలెక్టరేట్‌లో మానిటరింగ్ సెల్‌ను పరిశీలించి, అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ మల్లిఖార్జున తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఈ కంట్రోల్ రూమ్ నుంచి సేవలు అందుతాయన్నారు. ఈ మేరకు 5 హంటింగ్ లైన్స్‌తో కూడిన 0891-2590100 ఫోన్ నెంబర్ నిత్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. సాధారణ ప్రజలు, అభ్యర్థులు, ఇతర వ్యక్తుల నుంచి ఫోన్ల ద్వారా ఫిర్యాదులు స్వీకరించి నివేదిస్తారని వివరించారు.



మీడియా సెంటర్, సోషల్ మీడియా సెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు పటిష్ట చర్యలు

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ డా.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ కోసం కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేసిన వివిధ మానిటరింగ్ కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి మానిటరింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో తగినంత మంది సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ముందుగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్, వెబ్ కాస్టింగ్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం 104 కాల్ సెంటర్ రూమ్‌లో ఏర్పాటు చేసిన 24/7 పనిచేసేలా కాల్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందికి సూచనలు జారీ చేశారు. రెండో అంతస్తు అదే వరుసలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్-మోనటరింగ్ సెల్(ఎంసీఎంసీ) ఫిర్యాదుల నమోదు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అనంతరం సింగిల్ విండో కేంద్రం, బడ్జెట్ ఎక్స్‌పెండేచర్ కేంద్రం, మీడియా, సోషల్ మీడియా కేంద్రాన్ని పరిశీలించిన డా.మల్లికార్జున వివిధ సూచనలు జారీ చేశారు. ప్రతి కేంద్రంలో ఉండే సిబ్బందికి వారి వారి విధులు, ఎన్నికల ప్రక్రియ గురించి అవగాహన కల్పించాలని వీలుంటే శిక్షణ అందించాలని ఎన్నికల సెల్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట కలెక్టరేట్ ఏవో బీఎస్ దేవ్ ప్రసాద్, నోడల్ అధికారులు, ఎన్నికల సెల్ అధికారులు తదితరులు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా రిటర్నింగ్ అధికారులు

నియోజకవర్గం	రిటర్నింగ్ అధికారి	ఫోన్ నంబర్
విశాఖ పార్లమెంట్	డా.మల్లికార్జున, జిల్లా కలెక్టర్	8331093001
భీమిలి	ఎస్.భాస్కర్ రెడ్డి, భీమిలి ఆర్డీవో	9849903854
విశాఖ తూర్పు	మయూర్ అశోక్, జాయింట్ కలెక్టర్	9959026611
విశాఖ పశ్చిమ	డి.హుస్సేన్ సాహెబ్, ఆర్డీవో, విశాఖ	9849903825
విశాఖ దక్షిణం	టి.సీతారామమూర్తి, ఎస్డీసీ(ఎల్‌పీ)	9441038667
విశాఖ ఉత్తరం	డి. అఖల, ఎస్డీసీ(ఎన్‌హెచ్-16)	9441140194
గాజువాక	డి.లక్ష్మారెడ్డి, వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ ఆఫీసర్	6309944449
పెందుర్తి	పి.శేషశైలజ, ఎస్డీసీ(కేఆర్ఆర్‌సీ)	9100064971

నియోజకవర్గాల వారీగా పోలింగ్ స్టేషన్లు, ఎన్నికల సిబ్బంది

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	అనుబంధ పోలింగ్ కేంద్రాలు	మొత్తం కేంద్రాలు	పోలింగ్ సిబ్బంది
భీమిలి	348	11	359	2154
విశాఖ తూర్పు	282	11	293	1758
విశాఖ దక్షిణం	235	02	237	1422
విశాఖ ఉత్తరం	272	03	275	1650
విశాఖ పశ్చిమం	220	02	222	1332
గాజువాక	302	04	306	1836
పెందుర్తి	282	17	299	1794
20 శాతం రిజర్వ్ సిబ్బంది	--	--	--	2389
మొత్తం	1941	50	1991	14335

ఎన్నికల ప్రవర్తన నియామవళి బృందాలు

నియోజకవర్గం	ఎంసీసీ	ఫ్లయింగ్ స్క్వాడ్	వీఎస్‌టీ	మొత్తం
భీమిలి	4	4	4	12
విశాఖ తూర్పు	3	4	3	10
విశాఖ దక్షిణం	3	3	2	8
విశాఖ ఉత్తరం	1	3	2	6
విశాఖ పశ్చిమం	3	3	2	8
గాజువాక	1	3	2	6
పెందుర్తి	3	3	3	9
మొత్తం	18	23	18	59

వైఎస్సార్‌సీపీ నుంచి రోజారాణి సస్పెన్షన్

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న జి.రోజారాణిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. పార్టీ క్రమశిక్షణా ఉల్లంఘనకు పాల్పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

ప్రగతి ఘనం భవిత ఉజ్వలం



మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

- సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా పాలన
- రూ.975.89 కోట్లతో 5,165 పనులు
- పూర్తయినవి 3,203, ప్రగతిలో 467
- ప్రారంభించినవి 675, టెండర్ దశలో 782
- మూడేళ్ల పాలనలో ఎంతో సంతృప్తి
- మేయర్ గొలగాని హరివెంకట కుమారి

పర్యావరణ నగరిగా..

విశాఖ పచ్చదనంతో కళకళలాడుతోంది. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం అందించడానికి జీవీఎంసీ ఎంతగానో కృషి చేస్తోంది. ఎకో-గ్రీన్, ఎకో-బ్లూ, ఎకో-జీరో ప్లాస్టిక్, ఎకో-జీరో పొల్యూషన్ ఐదు అంశాలతో కూడిన ఎకో వైజాగ్ అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సాగర తీర స్వచ్ఛతతో వ్యర్థాలు వెలికి తీసే చర్యలు చేపట్టాం. వాయు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు, ఇంధనాన్ని పొదుపు చేసేందుకు ప్రతి సోమవారం ప్రజా రవాణా ఉపయోగించాలనే నిర్ణయాన్ని ఆచరిస్తున్నాం.

దాబాగార్డెన్స్: మహా విశాఖ నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. కొద్ది రోజుల క్రితం నీతి ఆయోగ్ ఎంపిక చేసిన గ్రోత్ హబ్‌లో విశాఖ స్థానం దక్కించుకుంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో సైతం జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్ సాధించింది. ప్రపంచ పెట్టుబడుల సదస్సు, జీ-20 సదస్సు, మిలాన్‌తోపాటు అనేక అంతర్జాతీయ సదస్సులకు వేదికగా నిలిచింది. ఇప్పటికే పూర్తిచేసిన ప్రాజెక్టులు, సాధారణ పనులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జీవీఎంసీ పాలకవర్గం ఏర్పడి మూడేళ్లలో విశాఖ ఎనలేని పేరుప్రఖ్యాతలు సంపాదించుకుంది. మేయర్‌గా గొలగాని హరివెంకట కుమారి బాధ్యతలు స్వీకరించి సోమవారం నాటికి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడారు.

సిస్టర్ సిటీస్ భాగస్వామ్యంతో..

నగర ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడడంలో విజయం సాధించాం. యూఎస్ఏ ఇండియానా స్టేట్‌లోని సిస్టర్ సిటీస్‌గా పేరొందిన ఆ నగరాల మేయర్లతో ఒప్పందం కుదుర్చుకున్నాం. విద్య, వ్యాపార, సంస్కృతి, అభివృద్ధి తదితర అంశాల్లో ఒకరికొకరం సహకరించుకుంటున్నాం. కార్మెల్ సిటీ మేయర్ జేమ్స్ బ్రినార్డ్ ఇటీవల విశాఖను సందర్శించారు. నగరంలో అభివృద్ధిని చూసి బ్రినార్డ్ ముగ్ధులయ్యారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి

తన మూడేళ్ల పాలన ఎంతో సంతృప్తినిచ్చింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు అందేలా ఎప్పటికప్పుడు అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నాం. మూడేళ్లలో రూ.975.89 కోట్లతో 5,165 పనులు ప్రతిపాదించగా, రూ.504.70 కోట్లతో 3,203 పనులు పూర్తి చేశాం. రూ.135.79 కోట్లతో 467 పనులు ప్రగతిలో ఉన్నాయి. రూ.174.01 కోట్లతో 782 పనులు టెండర్ దశలో ఉన్నాయి. వివిధ కారణాలతో రూ.91.9 కోట్ల విలువగల 47 పనులు రద్దయ్యాయి. 2023-24 ఏడాదికి సంబంధించి రూ.205 కోట్ల 5 లక్షల అంచనాలతో 967 పనులు చేపట్టగా, రూ.70 కోట్ల 4 లక్షల వ్యయంతో 332 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పురోగతిలో ఉన్నాయి. 98 వార్డులకు రూ.148 కోట్ల 11 లక్షల అంచనాలతో 938 పనులు చేపట్టగా 577 పనులు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు

నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. తొలి దశలో రూ.20.77 కోట్లతో 59 పాఠశాలలు అభివృద్ధి చేశాం. రెండో దశలో రూ.34.79 కోట్లతో 87 పాఠశాలల్లో చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలో 20 బస్ షెల్టర్లను రూ.4.63 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దాం. జీవీఎంసీ పరిధిలో రూ.32.97 కోట్లతో 42 వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టగా, అందులో 40 ఆరోగ్య కేంద్రాల పనులు పూర్తయ్యాయి.

కళకళలాడుతున్న రహదారులు

జీవీఎంసీ పరిధిలో తొలి రెండు దశల్లో 25 ప్రధాన రహదారులను విస్తరించి అందంగా తీర్చిదిద్దాం. రూ.140.15 కోట్లతో ప్రధాన రోడ్ల విస్తరణ చేసేందుకు ప్రతిపాదించగా ఒక పని పూర్తయింది. 15 పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. రోడ్ల మరమ్మతుల్లో భాగంగా అన్ని జోన్లలో మూడు దశల్లో రూ.16.33 కోట్లతో 13,325 పాత్‌హోల్స్ మరమ్మతులు చేపట్టగా 1,018 పనులు పురోగతిలో ఉన్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్ల అభివృద్ధికి రూ.28.50 కోట్లతో అంచనాలతో 14 పనులు చేపట్టగా 8 పనులు పూర్తయ్యాయి. వివిధ జంక్షన్లలో అభివృద్ధి పనులు రూ.7.50 కోట్ల అంచనాలతో 16 పనులు చేపట్టగా దాదాపు పనులు పూర్తయ్యాయి.

పార్కుల్లో మౌలిక సదుపాయాలు

జీవీఎంసీ పరిధిలో యోగా పార్క్, స్పోర్ట్స్ పార్క్, స్నేపర్స్ పార్క్, ఫోమ్ గార్డెన్ పార్క్‌లను థీమ్ పార్కులుగా అభివృద్ధి పరిచాం. రూ.11.97 కోట్ల అంచనాలతో చేపట్టిన పనుల్లో 4 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు ముగింపు దశలో ఉన్నవి. రూ.5 లక్షలతో శివాజీ పార్కులో 7 ఫౌంటైన్లను ఏర్పాటు చేశాం. 15వ ఆర్థిక సంఘం నిధులతో 9 ఫౌంటైన్లు అభివృద్ధి చేసేందుకు రూ.1.50 కోట్లతో 8 పనులు పూర్తయ్యాయి.

80 శాతం పూర్తయిన 24 గంటల పాటు నీటి సరఫరా ప్రాజెక్టు

మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనుల్లో భాగంగా ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులతో రూ.385.65 కోట్లతో 24 గంటల మంచినీటి సరఫరా పథకం చేపట్టాం. 80 శాతం పని పూర్తయ్యింది. 24 డీఎంఏలో సుమారు 5 వేల కుళాయిలకు మాధవధార, మర్రిపాలెం ప్రాంతాలకు 24 గంటల మంచినీటి సరఫరా చేస్తున్నాం. రూ.14.3 కోట్లతో మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్‌లో 3 ఎండబ్ల్యూ ఫ్లోటింగ్ సోలార్ పీవీ పవర్‌ప్లాంట్, రూ.7.93 కోట్లతో ముడసర్లోవ క్యాచ్‌మెంట్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. జీవీఎంసీ, స్మార్ట్‌సిటీ నిధులు, బ్యాంకుల ఆర్థిక సహాయంతో రెండు ప్యాకేజీల్లో రూ.940 కోట్లతో పెందుర్తి, గాజువాకలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను ఏర్పాటు చేశాం. శుద్ధి చేసిన నీటిని పారిశ్రామిక అవసరాలకు వినియోగించే పనులు పురోగతిలో ఉన్నవి.

21న పోలీస్ షాపులకు బహిరంగ వేలం

విశాఖ సిటీ: పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న రక్షా ప్లాజా (కేజీహెచ్ డౌన్‌లో ఉన్న)లో ఖాళీ షాపులకు ఈ నెల 21వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రక్షా ప్లాజాలో మొదటి అంతస్తులో షాపు నెం-25, టెర్రస్ మీద ఉన్న షెడ్ డార్మిటరీ కోసం అద్దెకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు పోలీస్ బ్యారక్స్ పోలీస్ సమావేశ మందిరంలో జరిగే వేలం ప్రక్రియలో పాల్గొనాలని సూచించారు.

నేడు జాబ్ మేళా

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం గౌరీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు డబ్ల్యూఎన్ఎస్, డెక్కన్ ఫైన్ కెమికల్స్ కంపెనీల్లో 225 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏదైనా డిగ్రీ, బి ఫార్మా, ఎంఫార్మా, ఐటీఐ ఎలక్ట్రికల్, ఫిట్టర్ పూర్తి చేసిన వారంతా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హత ఆధారంగా రూ.15 వేలు నుంచి రూ.20 వేల వరకు జీతం ఉంటుందన్నారు.



సంపత్ వినాయక గుడిలో పూజలు చేస్తున్న విద్యార్థులు



గాయంతోనే..



గురువు ఆశీర్వచనం తీసుకుంటూ..



ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో తనిఖీ చేస్తున్న సిబ్బంది

తొలి రోజు ప్రశాంతం

- పదో తరగతి పరీక్షలకు 99 శాతం హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

విశాఖ విద్య: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 138 కేంద్రాల్లో జరిగిన తొలిరోజు పరీక్షకు 29,040 మందికి గాను 28,673 మంది విద్యార్థులు హాజరయ్యారు. 367 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు తెలుగు పరీక్షకు 99 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ వెల్లడించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించబోమని విద్యాశాఖాధికారులు ముందుగానే పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించడంతో ముందుగానే చేరుకున్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 8.45 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. సచివాలయ మహిళా పోలీసులను కేంద్రాల వద్ద విధుల్లో ఉంచారు. బ్యాగులు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కేంద్రాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీ : మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రాలపై గట్టి నిఘా పెట్టారు. స్క్వాడ్ అధికారులు జిల్లాలో 50 కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షల జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. జిల్లా అబ్జర్వర్, ఆర్జేడీ బి.విజయ భాస్కర్ రెండు కేంద్రాలను తనిఖీ చేశారు. తొలిరోజు ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. నగరంలోని రామ్‌నగర్ జంక్షన్ శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్లో పరీక్ష కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తనిఖీ చేశారు. ఓఎంఆర్ షీట్, పరీక్ష ప్రశ్నా పత్రాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఓపెన్ పరీక్షలకు 1,809 మంది : సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరిగాయి. పదో తరగతికి ఐదు కేంద్రాల్లో 909 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 832 మంది హాజరయ్యారు. అదే విధంగా ఆరు కేంద్రాల్లో జరిగిన ఇంటర్మీడియెట్ పరీక్షకు 1,062 మందికి గాను 977 మంది హాజరైనట్లు డీఈవో చంద్రకళ వెల్లడించారు.



రామ్‌నగర్ చైతన్య స్కూల్లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున



తన కుమార్తెకు ఆల్ ద బెస్ట్ చెబుతూ..

క్లుప్తంగా

'గంటా'కే ఎందుకు ఈ మినహాయింపు

ఫ్లెక్సీల తొలగింపులో జీవీఎంసీ నిర్లక్ష్యం


గంటా ఇంటి పరిసరాల్లో తొలగించని ఫ్లెక్సీ

ఎంవీపీకాలనీ: ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో రాజకీయ ప్రముఖుల విగ్రహాలకు ముసుగు వేయడంతో పాటు హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను జీవీఎంసీ సిబ్బంది తొలగించగా...జీవీఎంసీ జోన్–3 అధికారులు మాత్రం టీడీపీ నేత, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు హోర్డింగ్ తొలగించకపోవడంతో విమర్శలకు వెల్లువెత్తుతున్నాయి. గంటాకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని ఆయని నివాసం దరి జీవీఎంసీ రోడ్డులో గతంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చి నాలుగు రోజులు అవుతున్నా సిబ్బంది తొలగించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. జీవీఎంసీ అధికారులు గంటాకు ఏమైనా ప్రత్యేక మినహాయింపు ఇచ్చారా.. అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

'స్టార్'సిటీ



కొమ్మాది: నగరంలో పలువురు సినీ నటులు సందడి చేశారు. గేమ్ చేంజర్ సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను ఆర్కే బీచ్‌లో చిత్రీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం నటుడు రామ్‌చరణ్, నటి కియారా అద్వానీతో పాటు, అంజలి, శ్రీకాంత్, శుభలేక సుధాకర్, నవీన్ చంద్ర, సముద్రఖణి, ప్రభాస్ శ్రీను, రఘుబాబు, అజయ్ ఘోష్ తదితర నటులు సందడి చేశారు.




పెద్దాస్పత్రికి ఫుల్ స్కాన్

- కేజీహెచ్‌లో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు
- రూ.కోట్లతో అధునాతన పరికరాలు
- వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట

మహారాణిపేట : విశాఖ కేజీహెచ్ పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధి. ఉత్తరాంధ్ర వైద్యానికి పెద్ద దిక్కు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. కోట్లాది రూపాయల విలువగల పరికరాలు ఏర్పాటు చేశారు. అత్యాధునిక వైద్యం పేదలకు అందిస్తున్నారు. కీలకమైన సిటీ స్కాన్, ఎంఆర్ఐ పరికరాలను కేజీహెచ్‌లో అందుబాటులో వచ్చాయి. క్యాన్సర్ నియంత్రణకు అత్యాధునిక వైద్య పరికరాలు కూడా ప్రభుత్వం అందజేసింది.

టీడీపీ హయాంలో నిర్లక్ష్యం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేజీహెచ్ రావాలంటే రోగులు ఇబ్బంది పడే పరిస్థితులుండేవి. వైద్య పరికరాలు అందుబాటులో ఉండేవి కావు. వార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉండేవి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వచ్చే రోగులు, వారితోపాటు సహాయకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు.

వైఎస్సార్‌సీపీ వచ్చాక మహర్దశ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ క్రమంలో కేజీహెచ్‌లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు సమకూరాయి. కోట్లాది రూపాయల విలువ గల వైద్య పరికరాలు ఏర్పాటు చేశారు. దీంతో రోగులు, వారి సహాయకులకు కేజీహెచ్ ఓ వరంలా మారింది. కేజీహెచ్‌కు వెళితే ఏ రోగమైనా నయం అవుతుందన్న భరోసా ఏర్పడింది.

సీఎస్ఆర్ నిధులతో..

కేజీహెచ్‌లో రూ.5.16 కోట్ల సీఎస్ఆర్ నిధులతో హెచ్‌పీసీఎల్ సంస్థ ఆధునిక వైద్య పరికరాలను, ఆక్సిజన్ యంత్రాలు, స్ట్రెచర్లను సమకూర్చింది. ఆస్పత్రిలో 10 విభాగాలకు చెందిన పరికరాల కొనుగోలు కోసం హెచ్‌పీసీఎల్ రూ.2.66 కోట్ల కేటాయించింది.


వినియోగంలో అంకాలజీ యూనిట్

కేజీహెచ్ అంకాలజీ వార్డులో లామినార్ ఎయిర్ ఫ్లో యంత్రాన్ని వినియోగంలో తెచ్చారు. ఈ పరికరం ద్వారా క్యాన్సర్ రోగులకు మరిన్ని సేవలు అందించడానికి వీలు కలుగుతోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత కేజీహెచ్‌లో అంకాలజీ యూనిట్ మొదలైంది. అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్పా ఆధ్వర్యంలో యూనిట్ పనిచేస్తోంది. అలాగే కేజీహెచ్‌లో రూ.14 లక్షలతో సీఆర్మ్స్ మెషిన్‌ను ఏర్పాటు చేశారు. ఆర్థోపెడిక్ శస్త్ర చికిత్సల కోసం ఈ మెషీన్ ఎంతో ఉపయోగపడుతోంది. పాత్ర ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో కేజీహెచ్ గైనిక్ వార్డుకు రూ.5 లక్షలతో పరికరాలు కొనుగోలు చేసి డాక్టర్ లక్ష్మికి అందజేశారు.

అందుబాటులో సిటీ స్కాన్

కేజీహెచ్‌లో సిటీ స్కాన్ పరికరాన్ని అందుబాటులోకి తెచ్చారు. రూ.3.82 కోట్ల విలువగల ఈ పరికరాన్ని ప్రభుత్వం సమకూర్చింది. రోజుకు 50 నుంచి 60 వరకు రోగులకు సీటీ స్కాన్ చేస్తున్నారు.





9 కొత్త అంబులెన్సులు

రూ.2.50 కోట్లతో తొమ్మిది అంబులెన్స్‌లను హెచ్‌పీసీఎల్ కొనుగోలు చేసి కేజీహెచ్‌కు అందజేసింది. ఇవి రోగులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

వినియోగంలో ఎంఆర్ఐ స్కాన్



ఎంఆర్ఐ స్కాన్ మెషీన్ కూడా వినియోగంలోకి తెచ్చారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ పరికరం కోసం రోగులు ఎదురుచూస్తున్నారు. రూ.11.25 కోట్లతో ఈ పరికరాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేసింది. రోజుకు 20–25 మంది రోగులకు స్కాన్ చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 24 గంటల పాటు సేవలు అందిస్తోంది.

రోగులకు సంపూర్ణ వైద్య సేవలు



కేజీహెచ్‌కు వచ్చే రోగులకు సంపూర్ణ వైద్య సేవలు అందుతున్నాయి. గతంలో కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే ఉండే పరికరాలు ఇప్పుడు పేదల కోసం ప్రభుత్వ, వివిధ సంస్థలు సమకూరుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆస్పత్రికి పలు ఖరీదైన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. కేజీహెచ్‌లో వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ వైద్యసేవలు అందిస్తున్నారు.

– పి.అశోక్ కుమార్,
కేజీహెచ్ సూపరింటెండెంట్, విశాఖపట్నం

కేజీహెచ్ రూపురేఖలు మారిపోయాయి



గతంతో పోలిస్తే కేజీహెచ్ రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలందుతున్నాయి. గతంలో ఆస్పత్రిలో వైద్యులు సక్రమంగా ఉండేవారు కాదు..కేజీహెచ్‌లో అడుగుపెట్టాలంటేనే హడలిపోయే పరిస్థితులుండేవి. ఏమాత్రం మౌలిక సదుపాయాలు ఉండేవి కావు. ప్రస్తుతం రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. మందులు, స్కానింగ్ పరికరాలు అందుబాటులో ఉండడం హర్షణీయం.

–రెయ్యి దేవిడ్ రాజు, రెల్లివీధి ఏరియా

దక్షిణ జనసేనలో సీటు చిచ్చు

- వంశీకృష్ణకు టికెట్ ఇవ్వొద్దని వేడుకోలు
- ఇస్తే ఓటమి ఖాయమంటున్న సాధిక్, మూగి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న కార్పొరేటర్ సాధిక్, మత్స్యకార నాయకుడు మూగి శ్రీనివాస్

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీలో చిచ్చు మొదలైంది. నెమ్మదినెమ్మదిగా అగ్గి రాజుకుంటోంది. నిన్నా మొన్నటి వరకు చెట్టాపట్టాల్ వేసుకుని తిరిగి జనసేన టికెట్ ఆశించిన నాయకులందరూ పటాపంచులవుతున్నారు. మాలో ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామన్న వారంతా ప్రెస్‌మీట్లు పెట్టి... ఆ వ్యక్తి ఇక్కడ పనికిరాడు... స్థానికుడినే ఇక్కడి ప్రజలు ఆదరిస్తారు... పక్క నియోజకవర్గంలో చిత్తుగా ఓడిపోయి జనసేనలో చేరిన వ్యక్తికి టికెట్ ఇస్తే మేము ఎలా పని చేస్తామంటూ నిప్పులు చెరుగుతున్నారు. అధినేత పవన్ కల్యాణ్ మాటంటే మాకు శిరోధార్యమంటూనే.. మేము కాదని బయటి వ్యక్తికి సీటు ఇస్తే ససేమిరా పనిచేసేది లేదంటున్నారు. ఓడిపోయే వ్యక్తి వంశీకృష్ణకు ఎట్టి పరిస్థితుల్లోనూ టికెట్ ఇవ్వొద్దంటూ పవన్ కల్యాణ్‌ను వేడుకుంటున్నారు. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు సోమవారం విలేకరులతో మాట్లాడారు.

మత్స్యకారులకే టికెటి ఇవ్వాలి..

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో వెనుకబడిన మత్స్యకార సామాజికవర్గం నుంచి జనసేన పార్టీకి ఎప్పటి నుంచో సేవలందిస్తూ, ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఆశించానని డాక్టర్ మూగి శ్రీనివాసరావు అన్నారు. సీటు తనకు కేటాయించకపోయినా పర్వాలేదు కానీ... విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన జెండా ఎగరాలంటే మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గానికి సంబంధం లేని, జనసేన పార్టీ కోసం ఒక్క రోజు కూడా కష్టపడని, సర్వేల్లో కూడా గెలవని వ్యక్తికి పార్టీ టికెట్ కేటాయిస్తే ఓడిపోవడం ఖాయమన్నారు. అసలు వంశీకృష్ణ అనే వ్యక్తికి టికెట్ ఇవ్వడమేంటో? పార్టీ అధినేత ప్రకటించకపోయినా ప్రకటించినట్టు నియోజకవర్గంలో ప్రచారం మొదలుపెట్టడమేంటో? తెలియడం లేదన్నారు. పక్క నియోజకవర్గంలో చిత్తుగా ఓడిపోయిన వ్యక్తికి ఇక్కడ టికెట్ ఇస్తే ఎలా?... అధిష్టానం పునరాలోచించకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

రెండుసార్లు ఓడిపోయిన వ్యక్తి గెలుస్తాడా..?

ఉత్తరాంధ్ర జిల్లాల జనసేన కో కన్వీనర్, 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్ మాట్లాడుతూ స్థానికుడిగా జనసేన పార్టీ విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించానన్నారు. స్థానికేతరుడైన వంశీకృష్ణ శ్రీనివాస్ తానే అభ్యర్థినంటూ ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. జనసేన పార్టీ అధికారికంగా ఎక్కడా వంశీకృష్ణ శ్రీనివాస్ పేరును ప్రకటించలేదన్నారు. అలా అని పార్టీ మమ్మల్ని పిలిచి ఎక్కడా చెప్పలేదన్నారు. నిజంగా జనసేన పార్టీకి ఆ ఆలోచన ఉంటే 21 సీట్లలో ఒకటి (విశాఖ దక్షిణ నియోజకవర్గం సీటు) కచ్చితంగా ఓడిపోతుందన్నారు. నియోజకవర్గానికి ఏమాత్రం సంబంధం లేని, కనీసం సామాజిక వర్గం కూడా బలంగా లేని వ్యక్తిని ఇక్కడ పోటీ చేసేందుకు అభ్యర్థిగా ప్రకటించాలనుకోవడం ఆశ్చర్యకరమన్నారు. ఈ నియోజకవర్గంలో గెలుపోటములు నిర్ణయించే సామాజికవర్గాలకు చెందిన వారిగా ఈ విషయం చెబుతున్నామన్నారు. 2014లో ఇదే వంశీకృష్ణ అతని సామాజిక వర్గం బలంగా ఉన్న తూర్పు నియోజకవర్గంలో 50 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారని గుర్తు చేశారు. 2009లో కూడా అదే తూర్పు నియోజకవర్గం నుంచి ఓడిపోయారని... అక్కడ గెలవని వ్యక్తి ఇక్కడ ఎలా గెలుస్తాడని సాధిక్ ప్రశ్నించారు.

వెనుకబడిన జిల్లాల ప్యాకేజీని పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కేఎస్ చలం

డాబాగార్డెన్స్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి పదేళ్లు కావస్తోంది. చట్టంలోని 46(3) ప్రకారం ఉత్తరాంధ్ర జిల్లాలకు వెనుకబడిన జిల్లాల ప్యాకేజీ పునరుద్ధరించాలని యూపీఎస్సీ మాజీ చైర్మన్, ప్రొఫెసర్ కేఎస్ చలం డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జిల్లాలను పునర్‌వ్యవస్థీకరించి 6 జిల్లాలుగా ఉత్తరాంధ్ర రూపొందించి, గోదావరి వరకు సాగిందని, ఈ ఆరు జిల్లాలు, మూడు ప్రధాన భాగాలుగా, ఆదివాసి, తీర, మైదాన ప్రాంతాలుగా విభజించారన్నారు. విశాఖపట్నం ఈ ప్రాంత చారిత్రక, ఆర్థిక, సామాజిక, సంస్కృతికి కేంద్రంగా ఉందని, ఆంధ్రప్రదేశ్‌కు మూడింట ఒక వంతు రాష్ట్ర ఆదాయాన్ని సమకూరుస్తున్న విశాఖ గానీ, ఇక్కడ ఉన్న దళిత, ఆదివాసి, వెనుకబడిన జనాభా 90 శాతంగా ఉన్నారన్నారు. కానీ వారి జీవితాల్లో మార్పు రాలేదని, ఇప్పటికైనా వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో అరసం కార్యదర్శి యు.అప్పలరాజు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

14 రోజుల చిన్నారికి అరుదైన చికిత్స

గాజువాక సన్‌రైజ్ ఆస్పత్రి వైద్యుల ఘనత

గాజువాక : అరుదైన వ్యాధితో పుట్టిన చిన్నారికి సన్‌రైజ్ పిల్లల ఆస్పత్రి వైద్యులు శస్త్ర చికిత్స నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. జన్మించిన 14 రోజులకే సాహసోపేతంగా శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు 35 రోజులపాటు శ్రమించి పసికందును బతికించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యం బృందంతో పాటు ఆస్పత్రి ఎండీ డాక్టర్ టి.తిరుపతి వివరాలు వెల్లడించారు.అమూల్య అనే మహిళ ఈ ఏడాది జనవరి 2న విశాఖ స్టీల్ జనరల్ ఆస్పత్రిలో ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ పసికందు ట్రాకియో ఇసోఫేజియల్ పిస్టులా, ఇసోఫేజియల్ ఎట్రిసియం వ్యాధితో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. ప్రతి 3,500 మందిలో ఒకరు ఈ వ్యాధితో జన్మిస్తారని వైద్యులు పేర్కొన్నారు. చిన్నారి ఆ వ్యాధికి గురైనట్టు గుర్తించిన వైద్యులు గాజువాకలోని సన్‌రైజ్ ఆస్పత్రిలో చేర్పించారు. గాలి గొట్టానికి, అన్నవాహికకు మధ్య ఫిస్టుల కనెక్షన్ ఉందని, అన్న వాహికకు, జీర్ణకోశానికి మధ్య ఎటువంటి కనెక్షన్ లేదని వైద్య బృందం గుర్తించింది. ఇటువంటి సమస్య ఉన్న పిల్లలు వెంటనే శస్త్రచిక్సిత చేయకపోతే



బతికే అవకాశం ఉండదని వైద్యులు తిరుపతి, గణేష్, రమణ, శ్రీలక్ష్మిలతో కూడిన బృందం తెలిపింది. ఇంత క్లిష్టమైన సమస్యగల శిశువుకు జన్మించిన 14వ రోజున వైద్య బృందం శస్త్రచికిత్స చేశారు. అనంతరం 35 రోజులపాటు వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందించారు. పాప ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు వివరిస్తూ ముందుకుసాగారు. ఊపిరి తిత్తుల్లో ఇన్ఫెక్షన్స్, న్యూమోథారాక్స్, సెప్టీసీమియా, హైపోటెన్షన్, అనేకసార్లు ఎక్స్‌టుబేషన్ వైఫల్యం, లారింగోమిలేషియా, రక్తహీనత వంటి ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నట్టు వైద్యులు వివరించారు. 31 రోజుల పాటు సీపీఏపీ మెషీన్‌ద్వారా బిడ్డకు ఆక్సిజన్ అందించారు. ఈ ప్రాసెస్‌లో బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం కూడా సవాలుగా మారిందని, వైద్య బృందం నిరంతర కృషివల్ల ఈ సమస్యను అధిగమిస్తూ వైద్యం అందించినట్టు పేర్కొన్నారు.

మీ సంకల్పానికి జేజేలు

విశాఖ విద్య: చదువే ఓ మూలధనం.. విద్యార్థులే కాదు.. సమాజంలో ఎవరైనా.. ఏ రంగంలోని వారైనా.. వారికిష్టమున్న రంగం కావొచ్చు..అంశం కావొచ్చు..చదవాల్సిందే..అధ్యయనం చేయాల్సిందే. పరుగెత్తు.. నడువు... లేదంటే పాకుతూవెళ్లు.. అంతేకానీ ఒకే చోట కదలకుండా కూర్చోకు.. అని మహాకవి శ్రీశ్రీ అన్నట్లే అందరూ చెప్పేది ఒకటే మాట చదువు. చదువు విలువ తెలిసిన వారు, ఎంతటి అవరోధాలు ఎదురైనా లక్ష్యసాధనలో వెనుకడుగు వేయరు. సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఇంటర్ పరీక్షలకు రాసేందుకు వచ్చిన కొంతమంది ఆ కోవకు చెందిన వారే...కదల్లేని స్థితిలో ఉన్నా, ఉన్నత చదువులు దరిచేరాలనే తపనతో పరీక్షలు రాసేందుకు ఉత్సాహంగా తరలివచ్చారు. చదువుకు వయసుతో సంబంధం ఏంటని నిరూపిస్తూ 60 ఏళ్లు నిండిన వారు పరీక్ష కేంద్రంలో అడుగుపెట్టారు. నగరంలోని మాధవధార మున్సిపల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో సోమవారం కనిపించిన దృశ్యాలకు చదువులమ్మ మురిసిపోయింది. అవరోధాలను అధిగమించి...అక్షరాన్ని అభిమానిస్తూ పరీక్షలు రాసేందుకు వచ్చిన వారు తమ సంకల్పాన్ని వెల్లడించారు. వారి మాటల్లోనే....

చదువుతోనే మానసిక దృఢత్వం



మాకు ఒక్కడే బాబు. చిన్న వయస్సులోనే వైకల్యానికి గురయ్యాడు. ఇంకో బిడ్డ కోసం ప్రయత్నించినా, జన్యుపరమైన కారణాలతో వైకల్యం తప్పదని వైద్యులు చెప్పడంతో ఆ ప్రయత్నాలు మానుకున్నాం. నేను ప్రైవేటు స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నా.. బాబు అభిషేక్ వీల్ చైర్‌కే పరిమితయ్యే పరిస్థితి. కానీ చదువు విలువ తెలిసిన వాళ్లం. నా భార్య కూడా పీజీ చదువుకుంది. అందుకే చదువుతోనే మానసిక దృఢత్వం కలుగుతుందని టెన్త్ పరీక్షలు రాయిస్తే, ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు. ఇప్పుడు ఓపెన్ ఇంటర్ పరీక్షలకు రాయిస్తున్నాం.

– శివప్రసాద్, విద్యార్థి తండ్రి

లాయర్ కావాలని..



అరవై ఏళ్లు నిండాయి. కానీ లాయర్ అవ్వాలని చిన్నప్పటి నుంచీ బలమైన కోరిక. అందుకే ఓపెన్‌లో ఇంటర్మీడియెట్ కోర్సుకు ఆర్ట్స్ గ్రూప్‌లో అడ్మిషన్ తీసుకున్నాను. ఇంటర్ పాసై, ఎంట్రన్స్ రాసి ఎల్ఎల్‌బీ చేస్తాను. చదువుకు వయసుతో పనేముంది. నా భర్త ప్రభుత్వ ఉద్యోగికి రిటైర్డ్ అయ్యారు. చదువుకుంటానని చెబితే, నాతో అడ్మిషన్ తీసుకునేలా వెన్నంటే ఉండి ప్రోత్సహించారు. ఇదిగో పరీక్షకు కూడా వెంటబెట్టుకొని తీసుకొచ్చారు.

–వర్ధమాని సరస్వతి

ఉన్నత చదువుతోనే ఉద్యోగం



మాది గాజువాక సమీపంలోని గంగవరం. టెన్త్ పూర్తి చేశాను. పెళ్లైంది. ఓ పాప కూడా ఉంది. ఇంటర్మీడియెట్ పూర్తి చేస్తే ఏదో ఒక ఉద్యోగం వస్తుందని ఆశ. మరొకరు సాయం వస్తేనే కానీ, ఉన్న చోట నుంచి కదలలేను. అయినా కుటుంబ అవసరాలు నన్ను ఉన్నత చదువు వైపు వచ్చేలా చేశాయి. చదువుతోనే ఏదైనా సాధ్యం. అందుకే ఇంటర్ పూర్తి చేసి, అవసరమైతే డిగ్రీ కూడా ఓపెన్‌లో చేస్తాను.

– బడే అప్పలరాజు